


# అమెరికులాసా కథ – 205

## "అనుకోని అదృష్టం" కథ

-

"మా రోజుల్లో ఎటాచ్డ్ ఫేమిలీసూ, డిటాచ్డ్ బాత్ రూములూ ఉండేవండీ....ఇప్పుడేమో డిటాచ్డ్ ఫేమిలీసూ, ఎటాచ్డ్ బాత్ రూములూనూ. అందుకే ప్రపంచం ఇలా ఏడిసింది." – ఆ మధ్య ఎవరో ఇలా వాపోతుండగా విని "కదా" అనుకున్నాను. ఫేమిలీస్ కలిసి ఉండదానికీ, టాయ్ లెట్లు విడిగా ఉండడానికీ లంకె ఏమిటో నాకు పూర్తిగా అర్ధం కాలేదు కానీ ఆయన బాధ ఏమిటో అర్ధం అయింది. అదేమిటంటే ఆయనా, ఆయన తమ్ముడూ అమెరికాలో మా ఊళ్ళోనే ఇంచుమించు ఒకే పేటలోనే ఉంటున్నా, ఒకరి బాత్ రూమ్ మరొకరు చూసి చాలా కాలం అయింది. అనగా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేసి, ఒకరింటికి మరొకరు వెళ్ళి..ఆ ఇంటి అమెరికాకి ఈ ఇంటి సోలార్ పానెల్స్ మీద వాలి చాలా కాలం అయింది. అలా వాల్తే కాలి కాల్తుంది అని కాదు కానీ ఇప్పుడు ఎవరి అమెరికుంటుంబాలు వాళ్ళవి. చిన్నప్పుడు ఇద్దరూ ఒకే కంచం లో తిని ఒకే మంచం మీద పడుకున్నా, ఇప్పుడు పెద్దాడి ఇంట్లో పెద్ద కొరెల్ బ్రాండ్ ప్లేట్లూ, చిన్నాడి ఇంట్లో బైర్స్ డాఫ్ వుల్ఫ్ గేంగ్ లాంటి నోరు తిరగని జెర్మన్ బ్రాండ్ కత్తులూ, కఠారులూ ఉంటాయి అని కూడా ఎవరో కామన్ స్నేహితులు చెప్తే కానీ ఒకరికొకరికి తెలియదు. వీళ్ళే కాదు. ఇలాంటి ఆటంబాంబు లాంటి ఇలాంటి కుటుంబాలు....అంటే భారత దేశంలో ఉన్నప్పుడు అంతా కలిసి మెలిసి ఉన్నా అమెరికా రాగానే ట్రంప్ గారు ఇరాన్ మీద వేసిన 'బంకర్ బస్టర్ బాంబు" లాగా పేలిపోయి విడిపోయిన అహంభావ కుంటుంబాలు... అమెరికాలో చాలానే ఉన్నాయి. ఏమాటకామాటే చెప్పుకోవాలి అంటే ఇప్పుడు ఇండియాలో కూడా పరిస్థితి అలాగే ఉంది. మా చిన్నప్పుడు ఏ రోజు ఎవరు ఎప్పుడు వచ్చి తలుపు కొడతారో తెలియక మా అమ్మ ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంచేది. తెల్లారగానే బస్సులోనో, ట్రైన్ లోనో చెప్పా పెట్టకుండానే చుట్టాలో, స్నేహితులో, లాయర్ అయిన మా నాన్న గారితో కోర్ట్ పనుల మీద ఆయన క్లయింట్స్లో, పొలం నుంచి పాలికాపులో..ఎవరయితే నేం...ప్రతీ రోజూ ఒక గంగాళం ముక్కల పులుసుతో సహా అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఇప్పుడు ఇండియాలో ఎవరింటికి వెళ్ళాలన్నా "ముందు ఫోన్ చేసి రండి" అని ముందే చెప్పేస్తున్నారు. తీరా వెళ్ళాక మొదటి ప్రశ్న "అమెరికా నుంచి ఎప్పుడొచ్చావూ? ఎప్పుడు వెళ్తావూ?" అనే!. ఇక అందరూ

'మా ఇల్లు" అని చెప్పుకున్నా అది నిజానికి ఐదారు అంతస్థుల ఎపార్ట్మెంట్ కాంప్లెక్స్ లో రెండు, మూడు గదుల ఫ్లాట్ మాత్రమే. కిందటి సారి నేను ఇండియా కార్లో వెళ్తున్నప్పుడు ఆంధ్రాలో మారుమూల పల్లెటూళ్ళలో కూడా కాంక్రీట్ భవనాల మధ్య ఒక్క పెంకుటిల్లు కనపడినా, ఎడ్ల బండి కనపడినా ఫొటోలు తీసేసుకున్నాను. ఇక పూరి పాకల గురించి కథల్లో చదువుకోవలసిందే. లేదా సినిమాలలో చూడవల్సిందే!. దేశం పురోగమించింది.

ఇలా ఎవరి కుటుంబాలు వారివే అనే నేపథ్యం ఇప్పుడు ఎందుకు గుర్తు వచ్చిందీ అంటే....

మొన్న మా పెద్దమ్మాయి ఫోన్ చేసి "నాన్నా, గెస్ వాట్?" అంది. నాకు వెంటనే గుండె గుభేల్ మంది. ఎందుకంటే ఈ దిక్కుమాలిన 'గెస్ వాట్" అని ఎవరైనా అంటే ఎక్కడో కొంప మునిగింది అనే కదా అర్థం. ఉదా. ఆ మధ్య నేను ఏదో కాస్త ఒంట్లో బాలేదు అనిపించి డాక్టర్ దగ్గరకి వెళ్ళగానే అతను ఏదో పరీక్ష చేసి, కళ్ళేగరేస్తూ "గెస్ వాట్?" అన్నాడు. "నేను చస్తే గెస్ చెయ్యను. నువ్వే చెప్పు" అని నేను కళ్ళు దించుకున్నాను. "నీకు కేన్సర్ లేదు..కానీ... " అన్నాడు వాడు ఒక వెర్రి నవ్వు నవ్వి. నాకు మటుకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు. 'కేన్సర్ లేదు'... దాకా బాగానే ఉంది. కానీ, 'కానీ' అంటే మరేదో ఉంది అని కదా.అదేదో చెప్పి చావచ్చు కదా. మధ్యలో ఈ గెస్ వాట్ ఆట ఎందుకూ? ఎందుకంటే...నా కడుపులో ఆ డాక్టర్ కి ఏదో నచ్చక ఏదో చిన్న సర్జరీ చేస్తాడుట. అదీ వాడి గెస్ వాట్ కి అర్థం. 'సరే చేసుకో పో" అనేసి ఆ తతంగం కానిచ్చేశాను. మరి ఇప్పుడు మా అమ్మాయి ఫోన్ లో అడిగిన "గెస్ వాట్?"కి అర్థం ఏమయి ఉంటుందో మనకి తెలియదు కదా. అంచేత యథాప్రకారం "నేను చస్తే గెస్ చెయ్యను. నువ్వే చెప్పు" అని చెప్పేశాను.

"నేను ఇంటికి వచ్చేస్తున్నాను" — మా అమ్మాయి ఉవాచ. అదేమీ కొత్త విషయం కాదు మాకు. మా అమ్మాయి ఉండేది మా ఇంటికి పది మైళ్ళ దూరం లోనే. ప్రతీ వారం వస్తూనే ఉంటుంది. మరి ఈ సారి "గెస్ వాట్?" ఎందుకుటా?

"నేనూ, మా ఆయనా, నీ మనవడూ, మన యోడా అనే బుజ్జి కుక్క పిల్లా..అందరం వచ్చేస్తున్నాం" — మా అమ్మాయి రెండో ఉవాచ. ఇది కూడా మాకు అలవాటే. అంచేత "గెస్ వాట్" కి ఇంకా విపరీతార్థం ఏదో ఉంది.

"ఈ సారి పెట్టే, బేడాలతో వస్తున్నాం. ఆరు నెలలు ఉండాలి మరి".. గెస్ వాట్..అదే ట్రంప్ గారి 'బంకర్ బస్టర్". చెప్పొద్దూ..ఈ బాంబుకి నాకు భలే సంతోషం వేసింది... అమ్మాయీ, అమెరికన్ అల్లుడూ, మనవడూ, వాళ్ళ పెంపుడు కుక్కా...మాతో ఆరు నెలలు ఉండడం అనేది "డిటాచ్డ్ ఫేమిలీస్" నేపథ్యంలో అమెరికాలో ఇలాంటి అదృష్టం ఎంత మందికి దక్కుతుంది?,

ఇంతకీ అసలు జరుగుతున్న తతంగం ఏమిటంటే...

మా అమ్మాయి కుటుంబం మూడేళ్ళ క్రితం కొనుక్కున్న ఇల్లు అప్పుడు తను కార్డియాక్ నర్స్ గా ఉద్యోగం చేసే ఆసుపత్రికి దగ్గర, మా ఇంటికి సుమారు 20 మైళ్ళు. ఇప్పుడు తను ఇంకా పై చదువు చదివి, ఈ రోజుల్లో అమెరికాలో డాక్టర్ల కొరత వలన బాగా ప్రాముఖ్యత పెరిగి పేషెంట్ల రోగ నిర్ధారణ చేసి ప్రిస్క్రిప్షన్లు కూడా రాసి, ట్రీట్ మెంట్ చేసే నర్స్

ప్రాక్టీషనర్ స్థాయికి చేరి కాస్త అనుభవమూ, చాలా మందితో పరిచయాలూ పెరిగిన మా అమ్మాయి సొంత ప్రాక్టీసు పెట్టుకుంది. అంటే ఇప్పుడు నాతో సహా చాలా మందికి తనే ప్రైమరీ కేర్ ప్రాక్టీషనర్ అనమాట. దానికి కావలసిన సరంజామాతో తను మొదలు పెట్టిన క్లినిక్ మా ఇంటికి దగ్గరే. ఇక మా అల్లుడు భాగస్వామిగా పని చేసే కంప్యూటర్ కంపెనీ కూడా ఇక్కడికి దగ్గరే. పైగా మా ప్రాంతంలో స్కూళ్ళకి మంచి పేరు ఉంది. మూడేళ్ళ మనవడు ఇప్పటికే అతి తెలివి చూపించేస్తున్నాడు కాబట్టి వాడు ఎదిగే సమయానికి మంచి స్కూల్ లో వెయ్యాలి అన్నా కూడా మా ప్రాంతంలో కొత్త ఇల్లు కొనుక్కోవాలి. అంటే ఉన్న ఇల్లు ముందు అమ్మి, వచ్చిన డబ్బు కొత్త ఇంటికి డౌన్ పేమెంట్ గా కట్టాలి. అంచేత ఆ ఇల్లు అమ్మకానికి పెట్టి, కొత్త ఇంటికి మా పేటకి దగ్గరలో స్థలం ఎంపిక చేసుకుని ఆరున్నర లక్షల డాలర్లకి మా అమ్మాయీ, అల్లుడూ సంతకాలు పెట్టేశారు. నా అప్రస్తుత ప్రసంగమే కానీ మా వంతు సహాయం మేమూ చేశాం అనుకోండి. అది వేరే సంగతి. అంత వరకూ బాగానే ఉంది కానీ, అనుకోకుండా పాత ఇల్లు తొందరగా అమ్ముడయి పోయి అది ఖాళీ చెయ్యవలసి వచ్చింది. కానీ....ట్రంప్ గారి ధర్మమో మరేమిటో కానీ కొనుక్కున్న ఖాళీ స్థలంలో పునాదులు వేసి కొత్త ఇల్లు కట్టడానికి ఆరు నెలలు పడుతుంది ట. మామూలుగా అయితే ఆ ఆరు నెలలూ ఎక్కడో ఒక ఎపార్ట్ మెంట్





అద్దెకి తీసుకుని ఉండవచ్చు. అది అందరూ చేసే పనే కానీ...మా అమ్మాయి మామూలు అమ్మాయి కాదు కదా...దానికి కొడుకు పుట్టినప్పుడు వాడి పేరులో నా పేరు కూడా కలిపి అవినాష్

రాజు అని పెట్టుకున్న లాంటి మంచి ది కదా...అంచేత ఈ 'గెస్ వాట్?" అవిడియా వచ్చింది అనమాట. మా క్వీన్ విక్టోరియా ముందు కాస్త బెంబేలు పడినా....ప్రతీ వారం మనవడితో ఆడుకునే అలవాటు వలన నాలాగే తను కూడా కొత్త ఇల్లు పూర్తి అయేదాకా మా అమ్మాయి కుటుంబం హాయిగా మా ఇంట్లోనే ఉండదానికి ఒప్పేసుకుంది.

ఇప్పుడు మా ఇంట్లో మేడ మీద అడుగుపెట్టడానికి కూడా చోటు లేదన్ని ఫర్నిచరూ, గరాజ్ నిండా పాతిక పైగా అట్టపెట్టెలతో సామాన్లు...మిగిలిన పెద్ద మంచాలూ, పరుపులూ వగైరాలు పబ్లిక్ స్టోరేజ్ లోనూ సద్దేసి గత వారం మళ్ళీ ఉమ్మడి కుటుంబ జీవితం మొదలు పెట్టాం...అఫ్ కోర్స్..ఇంకో అమ్మాయి డాలస్ లోనూ, సుపుత్రుడు ఆస్టిన్ లోనూ ఉండి కొత్త ఇళ్ళు కొనే పనిలో లేరు కాబట్టి సరి పోయింది.

.

గత వారం, పది రోజులుగా మా ఇద్దరి జీవితాలలో కొన్ని ఈతి బాధలూ, మరి కొన్ని ఈతి 'భాగ్యాలు' తో కలకలలాడుతోంది అనే చెప్పాలి. మా క్వీన్ విక్టోరియా, నేనూ ఆ మూడేళ్ళ చంటి వెధవని పట్టుకోడానికి తోట అంతా పరిగెట్టలేక ఒకర్నొకరు తిట్టుకోడం. యోడా అనే ఆ బుజ్జి కుక్క పిల్లకి కోపం వచ్చినల్లా ఇల్లంతా 'పాడు" చేస్తే ఆ ' క్లీనింగ్ పని నీదే' అని నేనూ, 'నా మొహం, నీదే' అని తనూ 'ఉస్కో అంటే ఉస్కో" అని అరుచుకోవడం...మా ఈతి బాధలలో కొన్ని. ఇప్పుడు రోజూ ఆ దిక్కుమాలిన 'రంగుల రాట్నం" 875వ ఎపిసోడ్, లేదా ఎప్పటికీ చిక్కు విడిచావని "బ్రహ్మముడి" వెయ్యిన్నొక్క ఎపిసోడ్ లాంటివి చూసి భోరుమనడానికి వీల్లేకుండా, మనవడిని ముందు పెట్టుకుని డిస్నీ లోనో, కార్టూన్ నెట్ వర్క లోనో మికీ మౌస్, డంబో లాంటి జంతువులనీ, చూసి వాడితో పాటు కేరింతలు కొడుతున్న మా క్వీన్ విక్టోరియాని నేను చూడడం అరుదైన 'ఈతి భాగ్యం".

అన్నింటి కన్నా మహద్భాగ్యం....ఇప్పటికే ఒకటీ, రెండూ అంటూ పది దాకా అంకెలు లెక్కపెట్టడం, 'తాతా" 'అమ్మమ్మా" అనడం నేర్చేసుకున్న మా మనవడికి తెలుగు అక్షరాలు నేర్పించడం.... కావాలంటే ఆ ఫొటోలు రెండూ, అల్లుడు గారు మా డైనింగ్ టేబుల్ మీదా, కిందా పరిచి పెట్టిన సామాగ్రితో ఒక ఫొటో ఇక్కడ పెట్టాను చూడండి.

అందుకే అన్నాను... "అనుకోని అదృష్టం" ... ."దొరకునా ఇటువంటి సేవ" అని కూడా అనుకోవచ్చు.

**COMMENTS**